గణపతి సేవకు వేళాయె!

తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాలు వినాయకచవితి పండుగ శోభను సంతరించుకున్నాయి. వాడవాడలా గణనాథుని ప్రతిమలు కొలువుదీరుతున్నాయి. చలువ పందిళ్లతో వీధులు కళకళలాడుతున్నాయి. విద్యుద్దీపాల వెలుగుల్లో శోభిల్లుతున్నాయి. పూజా సామగ్రి కొనుగోలుదార్లతో వీధులు కిక్కిరిసిపోయాయి. ఈ క్రమంలోనే మట్టి గణపతి ప్రతిమల విక్రయాలు ఊపందుకున్నాయి.

- వాడవాడలో కొలువుదీరుతున్న వినాయక విగ్రహాలు
- పూజా సామగ్రి కొనుగోళ్లతో కిక్కిరిసిన వీధులు
- మట్టి ప్రతిమలకే మొగ్గుతున్న ప్రజలు

తిరుపతిలో కిక్కిరిసిన మార్కెట్ రోడ్డు



చంద్రగిరిలో..



తిరుపతి కల్చరల్ : నగరంలోని ప్రధాన కూడళ్లు, వీధులలో ప్రత్యేక ఏర్పాటు చేసిన మండపాలలో చవితి పూజలకు నిర్వాహకులు సన్నద్ధమయ్యారు. ఈ ఏడాది తిరుపతి సుమారు 700కుపైగా వినాయక విగ్రహాలను నెలకొల్పనున్నారు. పూజా సామాగ్రి, వినాయక విగ్రహ ప్రతిమల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గాంధీ రోడ్డు, ఇందిరా ప్రియదర్శిని మార్కెట్ రోడ్డు, బైరాగిపట్టెడ, ఆర్‌సీ రోడ్డు, అన్నారావు సర్కిల్, బాలాజీ కాలనీ, ఐఎస్ మహల్ రోడ్డు, సత్యనారాయణపురం సర్కిల్ వంటి ప్రధాన వీధులు జనం కిక్కిరిశాయి.

చంద్రగిరిలో..

చంద్రగిరి: స్థానిక టవర్‌క్లాక్ వద్ద గణపయ్య విగ్రహాలతో పాటు పూజా సామగ్రిల కొనుగోళ్లకు ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్ ఇక్కట్లు తలెత్తాయి. అలాగే స్థానిక ఆర్‌ఎఫ్ రోడ్డులోని బ్లూమింగ్ బడ్స్ పాఠశాలలో మంగళవారం ముందసుతగా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు, సిబ్బందికి అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

పాకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

పాకాల : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినాయక చవితికి ఉపయోగించే పత్రిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్‌వీ రమేష్‌కుమార్, అధ్యాపకులు మానులామణి, చిట్టికళావతి, ఆదిశేఖర్‌రెడ్డి, ఈశ్వర్ బాబు, రమణమ్మ, మహబూబ్‌బాషా, ఢిల్లీప్రసాద్ పాల్గొన్నారు.

మట్టి ప్రతిమల తయారీ పోటీలు

తిరుపతి తుడా : మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య కోరారు. మంగళవారం నగరంలోని ఏజీఎస్ కళాశాల ప్రాంగణంలో వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల తయారీపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు సర్టిఫికెట్లతో పాటు పూల మొక్కలను అందజేశారు. సామంచి శ్రీనివాసులు, భానుప్రకాష్ రెడ్డి, గుండాల గోపీనాథ్ రెడ్డి, నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతిమల పంపిణీ

తిరుపతి కల్చరల్ : కొత్త వీధిలోని ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో ప్రజలకు మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. విశ్రాంత న్యాయమూర్తి రాజీవ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి హేమచంద్రకుమార్, సభ్యులు సురేష్, సుకుమార్ ,లత, సుష్మ శేఖర్, సందీప్, రామమూర్తి పాల్గొన్నారు.

శ్రీమహాలక్ష్మి యూనియన్ ఆధ్వర్యంలో..

శ్రీమహాలక్ష్మీ జీపు, సుమో యూనియన్ అసోసియేషన్ నేత రాజేష్ యాదవ్ ఆధ్వర్యంలో శ్రీగోవిందరాజస్వామి కోనేటి వద్దప్రజలకు ఉచితంగా 500 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. సామంచి శ్రీనివాస్, కృష్ణా యాదవ్, ఆముదాల కృష్ణ, మురళీకృష్ణ, వాసు, ప్రకాష్ పాల్గొన్నారు.

కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో..

తిరుపతి అర్బన్: మట్టివిగ్రహాలకే ప్రాధాన్యత ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సి. రాజశేఖర్ కోరారు. కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యుడు నగలపాటి నాగేశ్వరరాజు ఆధ్వర్యంలో తుడా ఆఫీస్ సర్కిల్ వద్ద 4వేల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా ప్రజలకు పంపిణీ చేశారు.






విద్యార్థులను అభినందిస్తున్న కమిషనర్ మౌర్య, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..., గోవిందరాజస్వామి కోనేరు వద్ద..., కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో..

ఉచిత గణపయ్యా.. నీ జాడ ఏదయ్యా!

- నాడు 1.60లక్షల కుటుంబాలకు ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేసిన చెవిరెడ్డి
- నేడు విగ్రహాల కోసం రోడ్లపై ప్రజల వెతుకులాట
- చవితి వేడుకల్లో చెవిరెడ్డి లేని లోటు సుస్పష్టం
- చంద్రగిరి నియోజకవర్గంలో చర్చించుకుంటున్న జనం



మట్టి విగ్రహాలను పరిశీలిస్తున్న చెవిరెడ్డి (ఫైల్)

తిరుపతి రూరల్ : ఒకప్పుడు వినాయక చవితి వచ్చిందంటే చాలు.. ఉదయం 6గంటల నుంచే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా అందించేవారు. అలాగే పూజా విధానం వివరించే పుస్తకాలను పంపిణీ చేసేవారు. గత పదేళ్లుగా చంద్రగిరి నియోజకవర్గంలో ఒక్కరు కూడా మట్టి విగ్రహాలను కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. వీధుల్లో ఏర్పాటు చేసుకునేందుకు పర్యావరణహితంగా పేపర్ గుజ్జుతో ప్రత్యేకంగా తయారు చేసిన గణేశుని విగ్రహాలను కూడా ఉచితంగానే ఇచ్చేవారు. మొత్తం ఖర్చును చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి భరించి ప్రజలకు పండుగ కానుకగా భావించేవారు. ఈ ఏడాది చెవిరెడ్డిని కుట్రలు చేసి అక్రమ కేసులో జైలుకు పంపడంతో ఆయన చవితి వేడుకలకు దూరమయ్యారు. ఫలితంగా మట్టి విగ్రహాల కోసం జనం రోడ్లపై వెతుకులాడుకునే పరిస్థితి వచ్చింది.

పండుగ పూట ఇంటికి..

చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 1.60లక్షల ఇళ్లకు మట్టి విగ్రహాలను తయారు చేయించి ఉచితంగా పంపిణీ చేస్తూ వచ్చారు చెవిరెడ్డి. అంతేకాక నియోజకవర్గ పరిధిలో సుమారు 180 పెద్ద విగ్రహాలను కూడా యువకుల కోరిక మేరకు ఉచితంగా అందించే వారు. పండుగ పూట గణపతిని ఇంటికి పంపించే చెవిరెడ్డిని జైలుపాలు చేయడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా సామవేద ఉపాకర్మ



ఉపాకర్మ కార్యక్రమంలో అధ్యాపకులు, పండితులు

తిరుపతి సిటీ : ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో సామవేద ఉపాకర్మను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ ప్రాంగణం వేదమంత్రాల ఘోషతో మార్మోగింది. ఏటా భాద్రపద శుక్లపక్ష హస్తా నక్షత్రంలో ఉపాకర్మ నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ కర్మ కేవలం శరీర శుద్ధికే పరిమితం కాకుండా, విద్యార్థుల మనోశుద్ధి, బుద్ధి శుద్ధి, విద్యాభివృద్ధికి పునాది వేస్తుందని అధ్యాపకులు, పండితులు వెల్లడించారు. విద్యార్థుల శరీర శుద్ధికోసం పంచగవ్య ప్రాసన, సర్వపాతక నివారణార్థం మహాసంకల్ప స్నానం, విద్యాభివృద్ధికోసం నూతన యజ్ఞోపవీత ధారణ, ఋషి, దేవత, పితృ పూజలు, నవగ్రహ హోమం వంటి కార్యక్రమాలు జరిపించారు. సామవేద విభాగాధ్యక్షుడు డాక్టర్ గిరిజా ప్రసాద్ షడంగి పర్యవేక్షించారు.

'కన్యాకుమారి' పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : మధుశాలిని సమర్పణలో సృజన్ అట్టాడ దర్శకత్వంలో రూపొందించిన కన్యాకుమారి చిత్రం అద్భుత ప్రేమ కథని లయన్స్ క్లబ్ ప్రతినిధి ఆర్కాట్ కృష్ణప్రసాద్, నటుడు వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. బుధవారం ఈ చిత్రం విడుదలవుతున్న నేపథ్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. బెల్లంకొండ సురేష్, శాంబోలు హరినాథ్, జగన్నాథం పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీకపిలేశ్వరస్వామి వారి ఆలయంలో ఉదయం 8 గంటలకు గణపతికి అభిషేకం, సాయంత్రం 5.30 గంటలకు మూషిక వాహనంపై స్వామివారి గ్రామోత్సవం.
- వినాయక చవితి సందర్భంగా నేడు స్విమ్స్‌లో ఓపీ, ఓటీలకు సెలవు.
- తిరుమల రెండో ఘాట్ రోడ్డులోని వినాయక స్వామి ఆలయంలో చవితి సందర్భంగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విశేష అభిషేకం, పూజ.

తప్పుడు కథనాలపై ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీన తిరుమల పర్యటనకు వస్తున్నట్లు తప్పుడు కథనాలతో ప్రజలను గందరగోళానికి గురిచేసిన మాయావి పత్రిక ఎడిటర్ కోలా లక్ష్మీపతిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు ఈస్ట్‌పోలీసులకు ఫిర్యాదు చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి తిరుమల పర్యటన నేపథ్యంలో డిక్లరేషన్‌పై సంతకం చేస్తేనే శ్రీవారి దర్శనానికి అనుమతిస్తామని టీటీడీ పేర్కొన్నట్లు అసత్య వార్తలు రాశారని మండిపడ్డారు. గతంలో వేద పండితులు ఆశీర్వదించిన తర్వాత అక్షింతలను తలపై దులుపేసుకున్నారని అవాస్తవాలను రాశారని ఆరోపించారు. కుట్రపూరితంగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లే పరిస్థితులను తీసుకువస్తున్న కోలా లక్ష్మీపతినిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు వాసుయాదవ్, దినేష్‌రాయల్, మద్దాలి శేఖర్, తిరుమలరెడ్డి, పసుపులేటి సురేష్, రమణారెడ్డి, శశిధర్ పాల్గొన్నారు.

ఘనంగా నేతల జన్మదినోత్సవం



మాధవరెడ్డి పుట్టినరోజు వేడుకల్లో మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్ : వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి పుట్టినరోజు వేడుకను మంగళవారం సి.గొల్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హాజరయ్యారు. అలాగే అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత సుధాకర్‌రెడ్డికి సైతం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మూలం చంద్ర మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మునీశ్వరరెడ్డి, సర్పంచ్ రవి పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలే మేలు



ధరణికోట లక్ష్మయ్య

తిరుపతి తుడా : మట్టి గణపతి ప్రతిమలనే ప్రతిష్ఠించుకుని పూజించుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కుమ్మరుల అభివృద్ధి సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు ధరణికోట లక్ష్మయ్య పిలుపునిచ్చారు. మంగళవారం ఈ మేరకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

తిరుపతి తుడా : వినాయక సాగర్‌లో గణపతి విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లను మంగళవారం సాయంత్రం పరిశీలించారు. భక్తులు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిమజ్జనం చేసేందుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకుంటే ఆయా మార్గాల్లో రద్దీ లేకుండా, సాఫీగా నిమజ్జనం చేసేందుకు వీలుంటుందని వివరించారు. ఈ మేరకు క్రేన్‌లు కూడా అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు.

బస్సులు కిటకిట




తిరుపతి సెంట్రల్ బస్టాండ్ సాధారణంగానే రద్దీగా ఉంటుంది. పండుగ రోజుల్లో మరింతగా కిక్కిరిసిపోతుంది. మంగళవారం ఈ క్రమంలోనే ప్రయాణికులతో కిటకిటలాడింది. వచ్చిన ప్రతి బస్సు క్షణాల్లో నిండిపోయింది. సీట్లు లేకపోయినా ప్రజానీకం నిలబడి కూడా గమ్యస్థానాలకు తరలివెళ్లింది. ఏటా పర్వదినాల సమయంలో నడిపే ప్రత్యేక సర్వీసులు ఈ పర్యాయం కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఉచిత బస్సులే ఇందుకు కారణమని పలువురు వ్యాఖ్యానించడం వినిపించింది.

- తిరుపతి అర్బన్

ఆడిట్ నివేదికకు ఆమోదం

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : టీటీడీ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆడిట్ నివేదికను ఆమోదించినట్లు సొసైటీ అధ్యక్షుడు ఆర్.కిషోర్‌కుమార్ తెలిపారు. మంగళవారం మహతి ఆడిటోరియంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సొసైటీ నికర లాభం రూ. 8.60 కోట్లు కాగా, రూ.4.33 కోట్ల సభ్యుల మూలధనంపై 15.5 శాతం డివిడెంట్ చెల్లింపునకు సైతం ఆమోదం లభించిందన్నారు. సభ్యులకు దీపావళి కనుక రూ.500 గిఫ్ట్ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. ఇన్సూరెన్స్‌ను రూ.3లక్షల నుంచి రూ.4లక్షలకు పెంచినట్లు వివరించారు. ఉపాధ్యక్షుడు టి.మహేష్ కోశాధికారి, ముని వెంకటరెడ్డి, డైరెక్టర్లు రాజకుమార్, చీర్ల కిరణ్, దొరై రాజు, హేమ సుధ పాల్గొన్నారు.

29న ప్రభాకరశాస్త్రి వర్ధంతి

తిరుపతి అన్నమయ్యసర్కిల్ : శ్రీమాన్ వేటూరి ప్రభాకరశాస్త్రి 75వ వర్ధంతిని ఈ నెల 29వ తేదీన తిరుపతిలోని శ్వేత భవనం ప్రాంగణంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం టీటీడీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఉదయం 10 గంటలకు శ్వేత భవనం ఎదుట ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించనున్నట్లు తెలిపింది. అనంతరం అన్నమాచార్య కళామందిరంలో వేటూరి ప్రభాకరశాస్త్రి సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు పేర్కొంది.